
# 'దీపాలు వెలిగాయి. కానీ —"




అరగంటనుంచీ క్లాసులో వింటున్న దేమీ అర్ధం కావడంలేదు వరలక్ష్మికి. ప్రొద్దున్నుంచీ అల్లాగే వుంది మనస్సు. సుడులుగా తి రు గు తు న్నా యి ఆలోచనలు. నిన్న సాయంత్రం అన్నయ్య వచ్చి చీకటి పడే వరకూ వున్నాడు. హాస్టలు విజిటింగు టైము ఐపోయినప్పటికీ, వార్డెన్‌తో చెప్పి తనతో మాట్లాడుతూ కూర్చుండిపోయాడు. "ఆలోచించు వరం!" అన్నాడు చివరికి. ఎంతో వేదనతో, ఎంతో సంకోచంతో ఎత్తాడు ఆ ప్రసక్తి అన్నయ్య.

ఆలోచించడానికి ఏముంది? తన బ్రతుకులో తను ఆలోచించు కోవడానికి అవకాశమిచ్చే విధంగా ఏమి జరిగింది కనుక? పదకొండో ఏట తనూ, నాన్నా అన్నయ్యా కలిసి వెళ్ళారు ఆ వూరికి. పద్ధెనిమిదేళ్ళైనా లేని ఆయనకి – తన భర్తకి, పెద్దపెట్టున వచ్చిన విషజ్వరం నెలరోజులు వేధించింది. ఆ జ్వరం నిమ్మళించకూడ దనీ, తనకి యింక ఏ సుఖమూ ఉండరాదనీ అప్పుడే విధించాడు భగవంతుడు. కష్టమూ, సుఖమూకూడా అనుభవించడం చేతగాని వయస్సు అది. తన బ్రతుకుకి ఆ సంఘటన ఎంత గొడ్డలిపెట్టో గ్రహించుకోలేని స్థితిలో జరిగిపోయిందది. తనని చూసి బావురు మనే అమ్మనీ, నాన్ననీ కానరాని గుబులుతో మసలే అన్నయ్యనీ చూసి తనకి ఏడుపు వచ్చింది, అప్పుడు.

గాలిలో అల్లాడే దీపంకన్నా పదిలంగా చూసుకున్నారు తనని వాళ్ళు. పద్ధెనిమిది, ఇరవై సంవత్సరాలు వచ్చేసరికి శరీరమంతా క్రొత్త శక్తితో, ఏమిచేద్దాము అన్న తహతహతో స్పందిస్తోంటే మనస్సు ఏమీ తోచక అలమటించింది. పేపర్లో ప్రకటన చూసి, మెట్రిక్కు పరీక్షకు చదివించే హాస్టల్లో చేర్పించారు నాన్న. తనలాంటివాళ్ళు కొంద రున్నారు హాస్టల్లో. ప్రొద్దున్నే లేచినప్పటినుంచీ తన యీడువాళ్ళతో కలిసి పనిపాటలు చేసుకోవడం, చదువుకోవడం – పండుగలనీ, ఉత్సవాలనీ, పరీక్షలనీ ఏదో ఒక సందడి హాస్టల్లో.

వరలక్ష్మికి ఒక్కో సబ్జక్టే చదువుతోంటే అర్థమయినట్లే వుండేదికాదు. అంతలోనే చటుక్కున మబ్బులు విచ్చినట్లు అర్థం కావడం ప్రారంభించేది. ఎన్ని విషయాలున్నాయి లోకంలో అనిపించేది కొన్ని పాఠాలు చదువుతోంటే. ఇంగ్లీషు చిన్నచిన్న మాటలుమాత్రమే వచ్చిన ఆమె రెండు సంవత్సరాల్లో బాగా అందుకుంది. మెట్రిక్కులో ఫస్టుక్లాసు వచ్చింది.

రిజల్టు వచ్చిన రోజున అన్నయ్యకి సంతోషంతో కళ్ళల్లో నీరుక్రమ్మింది. ఇంకేవిటన్న ప్రశ్న చెల్లెలి కళ్ళల్లో కనుపించింది అతనికి. మెరిసే ఆమె కళ్ళల్లోకి చూస్తే ఆమె ఏమి కోరుతోందో స్ఫురించింది. శక్తి చాలదని అనుమానించినా, తెగించి అడుగు ముందుకు వేశా డతను.

మూడు సంవత్సరాలుగా వరలక్ష్మికి జీవితం సందడిగా గడిచిపోతోంది. తనకంటే వయస్సులో చిన్నవాళ్ళే అయినప్పటికీ తోటిపిల్లలు ఎంతకలివిడిగా వుంటున్నారని! ప్రపంచం ఎంతో విశాలమైంది. ఎవరిదోవన వారు నడుస్తోంటేనే బాట ప్రక్కన చల్లని మంచినీళ్ళు అందించేందుకు, అయాచితంగా చేయూతిచ్చేందుకు ఎంద రుంటున్నారని! ఒకరి బుజాలమీద ఒకరు చేతులు వేసుకుని, హాయిగా ముందుకు పోవచ్చు అనిపిస్తుంది. పుస్తకాల్లో, పరీక్షల్లో తోటి పిల్లల నవ్వుల్లో రాత్రిళ్ళు పట్టుదలగా, తీక్ష



ణంగా వెలుగుతున్న ట్లుండే దీపాలలో – ఏదోదారి స్ఫురిస్తుంది ఆమెకి. ఇంకా, యింకా మెట్లున్నాయి ఎక్కవలసినవి. ఆకాశాన్నంటాలని తల ఎత్తే విశ్వవిద్యాలయం భవనాలు, భవనాల మీదుగా తేలిపోతూండే తెలిమబ్బులు ఎన్నిసార్లో చూసింది. తేలికగా పడే అడుగులతో లెక్కలేనన్ని మెట్లు ఎక్కి, ఆ భవనంలో నున్నని నేలమీద నడవాలి.

*  *  *

– అన్నయ్య కంఠం గద్గదికమైంది నిన్న సాయంత్రం. తను కోసేసేలాగా అన్నది మాటలు, 'ఎవ్వరికీ బరువు కావాలని అనుకోలేదు అన్నయ్యా – కాలేజీలో చేరడంవల్ల' అని. చాలా కష్టపడివుండాలి అన్నయ్య మనస్సు. "నువ్వు అలా అంటావని తెలిస్తే నేను యిటువంటి ప్రసక్తి తెచ్చేవాడిని కాదు వరం! ఫస్టుక్లాసులో ప్యాసైనానని నువ్వు సంతోషించావు. నీ ముఖం చూస్తోంటే, నొసటన యింతకుంకం వుంటే ముఖం ఎంత కళగా వుండేదో ననిపించి, నా గుండె తరుక్కుపోయింది వరం!'' అన్నయ్య కంఠంలో దుఃఖం వినిపించింది. అన్నయ్యని చూసి జాలివేసి ఏడిచింది.

"నాకు వద్దు అన్నయ్యా! నేను చదువుకుంటాను'' అని ఏడిచింది – ఎంతసేపో మాట్లాడకుండా కూర్చుని, చివరికి 'ఆలోచించు వరం' అనిచెప్పి వెళ్ళలేక వెళ్లాడు అన్నయ్య.

క్లాసు అయిపోయింది. గంటకొట్టారు. వీపుమీద గట్టిగా చరచి, "కంగ్రాట్యులేషన్స్ ోయి!'' అన్నది ఒకమ్మాయి, బయటికి వస్తోంటే. వరలక్ష్మి బిత్తరపోయి "ఎందుకని'' అన్నది. ఆ అమ్మాయి నవ్వింది. "క్లాసులోకూర్చుని ఏంచేస్తున్నావు మార్కులు చదువుతోంటే – బలేపోజు లిస్తావోయి!'' అన్నది. తనకి ఇంగ్లీషులో ఫస్టుమార్కు వచ్చిందని తెలుసుకుంది. తర్వాత ఎంత పరధ్యానంలో పడిపోయాను అనుకుంది.

ఆ రాత్రి పదిన్నర వరకు చదువుకుంటూ కూర్చున్నారు రూములోవాళ్ళందరూ – వరలక్ష్మి దుప్పటీ కప్పుకుని పడుకునేవుంది మంచంమీద. తలనొప్పిగా వుందా అని ఒకరిద్దరువలుకరించారు. కాదని తలూపింది ఆమె.

దీపాలు ఆర్పేసి అందరూ పడుకున్నారు. తలుపులు, కిటికీలు యీదురుగాలికి చప్పుడవుతున్నాయి. ప్రక్క రూములో ఫాను మెల్లిగా తిరుగుతోంది. వరలక్ష్మి కళ్ళు తెరచి చీకట్లోకి చూసింది. తనలక్ష్యం ఏమిటో తనకి ఎన్నిసార్లో గుర్తు వస్తూనేవుంది. ఎన్నో మెట్లు ఎక్కి తన జీవితం ఒక ఆశయానికి అంకితం చేయాల్సివుంది. లోకంలో ఎన్ని విషయా లున్నాయి తను నేర్చుకోవలసినవి? ఈ తరుణంలో ఎందుకు తనబ్రతుకు యింకో దారిన మళ్ళించాలి? రెండో పెళ్ళి చేసుకుని క్రొత్తబాధ్యతలు నెత్తిన వేసుకుంటే తన మనస్సుకి సంతృప్తి వుంటుందా – ఎంతబంధనం, ఎంతబాధ్యత, మనస్సు ఎంత పని! అన్నయ్య బాధ్యతకూడా యీ ఏడు తను బి. ఏ. పూర్తిచేసే సరికి తగ్గిపోతుంది. అన్నయ్యకి, తన చదువుకి వ్యాపకానికి దూరం చేసేస్తుంది పెళ్ళి.

వరలక్ష్మిఆలోచించడం అయిపోయింది. చటాలున లేచి, తన మంచంప్రక్క కిటికీలో

వున్న టేబిలులాంపు స్విచ్ వేసింది. దిండు క్రిందనుంచి కలం తీసికుంది – అన్నయ్యకి వ్రాసేయడానికి.

* * *

——పడక్కుర్చీలో వాలి, కిటికీలోంచి బయటికి చూసింది వరలక్ష్మి. ప్రొద్దున్న ఏడున్నరనుంచి కాలేజీ వుత్తరాలమీద సంతకాలు పెట్టడం ప్రారంభిస్తే, సాయంత్రం ఏడింటికి కొంచం తెరిపి కనుపించింది పనికి. పరీక్షల రోజులు, కాలేజీ తెఱిచిన రోజులు అయితే రాత్రి పదికూడా ఔతుంది. ఈ హడావిడిలో పడితే అన్నయ్యకిగానీ, మెడిసిన్ చదువుతున్న అనయ్యకూతురికిగానీ ఉత్తరం వ్రాయడమే పడటంలేదు.

బద్ధకంగా వున్నది, కానీ ఉత్తరాలు వ్రాసేయాలనిపించి లేచింది వరలక్ష్మి. డ్రాయరులోంచి కవర్లు లెటరుపాడ్ తీసుకుని టేబిలుదగ్గర కూర్చుని పెన్ను కోసమని హేండ్‌బ్యాగు తెరిచింది. పెన్నుతోపాటు అందులోవున్న కవరుకూడా చేతికి వచ్చింది. చటుక్కున గుర్తువచ్చింది ఆమెకి–మధ్యాహ్నం వచ్చింది యీ కవరు. తనపేరుమీద వున్నవన్నీ ఒక పాడ్‌లోపెట్టి యిచ్చేస్తారు ఆఫీసువాళ్ళు. ఈ వేళ యిది ఒక్కటే వచ్చింది. కృష్ణమూర్తి అని సంతకం చూడగానే, తనకి ఎవరో అర్ధంకాలేదు. కానీ – ఆఫీసు హడావిడిలోనే చటుక్కున గుర్తుకి వచ్చింది.

మళ్ళీ ఉత్తరం తీసి చదివింది. "మా అమ్మాయి నిన్న ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వచ్చినవాళ్ళల్లో వుంది. చాలామంది వచ్చారనీ, మీరుకూడా సెలక్షను కమిటీలో వున్నారనీ చెప్పింది. మీకు దాన్ని పరిచయంచేస్తే బాగుంటుందని వ్రాస్తున్నాను. మీకు చేతనైన సాయం చేస్తారని ఆశ.

ఇక్కడ ఆరునెలలుగా వుంటున్నాను.

నేను మిమ్మల్ని కలుసుకుందామని యీ మధ్య ఒకటి రెండుసార్లు వచ్చాను. మీ తలుపు వేసివుంది. ఎక్కడికో మీటింగులకి వెళ్లారని అక్కడున్న ప్యూను చెప్పాడు. నాపేరూ,అడ్రెసూ యివ్వలేదు–మీకు గుర్తు వుంటానని నమ్మకంలేక.

నేను – కృష్ణమూర్తిని. పంధొమ్మిది ఏళ్ళక్రితం మిమ్మల్ని యూనివర్శిటీలో ఒక మధ్యాహ్నంపూట కలుసుకున్నాను. మర్నాడు సాయంత్రం హాస్టలుకు వచ్చాను. మీరు నాతో ఒక పదినిముషాలు మాత్రం మాట్లాడారు. ఆ తర్వాత మరోసారి వస్తే నన్ను కలుసుకోనని కబురు చేశారు. గుర్తు వచ్చి వుంటుంది మీకు.

ఇల్లా గుర్తుచేయాలని నాకు మొదట్లో అనిపించలేదు. కానీ జీవితంలో స్మృతులుగా మిగిలిపోయిన కొన్ని అంశాలు తలచుకుంటే, వాటిని చెఱిపేసుకోవాలనిపించదు. నేను మిమ్మల్ని కలుసుకుని, మా ఆవిడని, పిల్లలని పరిచయం చేయాలనుకున్నాను. కానీ నాకు ట్రాన్స్‌ఫరైపోయింది. రేపు రాత్రి బయలుదేరుతున్నాము, మరోసారి కలుసుకుంటాను.''

కృష్ణమూర్తి! ఇరవైఏళ్ళ జీవితంలో వెనక్కు అంగలు వేసుకుంటూ వెడితే, తారసపడేవ్యక్తి. ఆ సంఘటనలన్నీ అంతగా తనకి గుర్తున్నట్లు తెలియదు వరలక్ష్మికి. కానీ యిప్పుడు స్పష్టంగా జ్ఞాపకం వస్తున్నాయి.

* * *

——లెక్చరుకి ఆలస్యమైపోయిందని కంగారుగా వుంది. బస్సుదిగి, హడావిడిగా ఆర్ట్సు కాలేజీమెట్లు ఎక్కుతూ చుట్టూచూసింది. ఎక్కడా ఒక్కరుకూడా లేరు. చాలా ఆలస్యమైపోయి వుండాలి. పదింటికి లెక్చరైతే తను పదింబావుకిగానీ బస్సు ఎక్కలేకపోయింది. వాచీ ఆగిపోవడంవల్ల ఎంత చిక్కువచ్చిపడింది – అనుకుంటూ మెట్లు ఎక్కింది. ఎక్కడా వరండాల్లోకానీ, సెమినారు హాలుబయటగానీ ఒక్కమనిషి కనుపించలేదు. శబ్దం కూడా వినిపించడం లేదు. జంకుతూ లోపలికి తొంగిచూసింది. అంతా ఖాళీగా వుంది.

ఏమైనట్లు అందరూ? లెక్చరు కాన్సిలు అయిందా? పెద్దటేబిల్సు చివర చదువుకుంటూ ఒకతను కూర్చుని వున్నాడు. వరలక్ష్మికి సంకోచం కలిగింది అతన్నడగడానికి. కానీ – లెక్చరు వున్నదో, అయిపోయిందో తెలుసుకోంది ఎల్లా?

"ఏమండీ – సెమినారు లెక్చరు అయిపోయిందాండీ?"అన్నది తనుముందుకువెళ్ళి. అతను తలెత్తిచూశాడు. వాచీచూసి, ఒక్కక్షణం ఆశ్చర్యంగా చూశాడు. "ఇంకా అరగంటపైన టైము వుంది కాదండీ?'' అన్నాడు.

వరలక్ష్మిమరీ ఆశ్చర్యపోయింది. "పదింటికి కాదూ. పదిన్నర దాటలేదూ యిప్పుడు?" అన్నది.

అతను మళ్ళీ గడియారం చూసుకున్నాడు. "తొమ్మిది యిరవైఐదు అయిందిప్పుడు. మీరు టైము తప్పు చూసుకున్నట్లున్నారు'' అన్నాడు. అని మెల్లిగా నవ్వాడు.

వరలక్ష్మికి అర్థమైంది యిప్పుడు – బస్సులు, రోడ్లు, కాలేజీ అన్నీ అంత నిర్జనంగా వుండడానికి కారణమేవిటో, ప్రొద్దున్నే మబ్బుగా వుండడంవల్ల టైము తెలియలేదు. టైంపీస్‌లో ఎనిమిదయ్యేసరికి తను తొమ్మిది అయిందనుకుని కంగారుపడి తయారై వచ్చేసిందన్నమాట. ఆలస్యమైపోయిందని డైనింగుహాల్లోకి వెళ్ళి టిఫిను తీసుకోకుండా సరాసరి వచ్చేసింది.

వరలక్ష్మికి నవ్వొచ్చింది. నవ్వింది – "పరధ్యానంగా గడియారంచూసి, అల్లా అనుకున్నాను. తిరిగి చూడనేలేదు ఏ గడియారం వంకా. తొందరపడి పరుగెత్తుకొచ్చాను" అన్నది.

అతనుకూడా నవ్వాడు. "మీరు సోషియాలజీ కదూ?" అన్నాడు. అవునని తలూపింది.

పాలిటిక్సు డిపార్టుమెంటులో లెక్చరరుగా క్రొత్తగావచ్చిన కృష్ణమూర్తితో అదీ తన తొలిపరిచయం. ఆతరువాత అతన్ని ఎక్కువగా కలవలేదు. బెనారెస్ వెళ్లిపోయాడతను రీడరుగా కొద్దికాలానికే.

వరలక్ష్మి సోషియాలజీ యం. ఏ. పూర్తి చేసింది. లెక్చరరుగా చేరి కొన్నాళ్ళు పని చేసిన తర్వాత, పాలిటిక్సు యం. ఏ. చదవాలనిపించింది. ఇంకో యం. ఏ. చదివి పని చేయాలని ఆలోచన వచ్చినా, పాలిటిక్సు చదవాలన్న కోరిక బాగా కలిగింది. బెనారెస్‌కి వ్రాసింది సిలబసుకోసం. ఎన్నాళ్ళకీ జవాబు రాలేదు.

రెండేళ్ళ క్రితం బెనారెస్ వెళ్ళిన కృష్ణమూర్తి గుర్తుకువచ్చాడు ఆమెకి. కొంచెం తటపటాయించి వ్రాసింది, తనకి వివరాలు పంపమని అడుగుతూ. అతను




జవాబు వ్రాశాడు. అది కేవలం వివరాలు యివ్వడం కోసమే కాకుండా, మళ్ళీ తన దగ్గర్నించి జవాబుకోరేట్లుగా వ్రాశాడతను. జీవితంగురించి, స్నేహాల్నిగురించి ఏవో వ్రాశాడు. తనని జాబు వ్రాయమని అడుగుతూ వ్రాశాడు. వరలక్ష్మి ఒక వారంపాటు ఉంచేసింది ఆ వుత్తరాన్ని. చివరికి జవాబు వ్రాసింది.

అతను మళ్ళీ రెండు, మూడు ఉత్తరాలు వ్రాశాడు. పరీక్షకి తప్పకుండా రమ్మనీ, అన్ని ఏర్పాట్లు చేస్తానని వ్రాశాడు. కొన్ని ఎస్సేలు తీసుకుని పంపాడు ఆమె చదువుకోవడంకోసం. వరలక్ష్మి వెంటనే జవాబు వ్రాసింది — 'అనవసరమైన చనువు తీసుకుంటున్నారు మీరు — అది నాకిష్టం ఉండదు.' అని స్పష్టంగా వ్రాసింది. ఆ తర్వాత అతను వ్రాయలేదు.

ఆ వేసవి సెలవుల్లో ఆమె యింటికి వెళ్ళలేదు. పరీక్షకి కట్టలేదు కానీ, కొన్ని పుస్తకాలు తెచ్చుకుని చదువుకుంటూ

హాస్టల్లోనే ఉండిపోయింది. పరీక్షకి కట్టడానికీ, బెనారెస్ వెళ్ళడానికీ ఎందుకనో ఆమె మనస్సు ఆతృత పడలేదు.

ఒక మధ్యాహ్నంపూట యూనివర్సిటీ లైబ్రరీలో తను పుస్తకాలకోసం కార్డులు వెతుకుతోంది. కావలసినకార్డు దొరకడంలేదు. "నమస్కారమండీ!'' అనడం వినిపించి, ఉలిక్కిపడింది. కృష్ణమూర్తి చేతులు జోడించి నిలబడివున్నాడు "నమస్కారం!" అన్నది.

"మీరు సెలవుల్లో యింటికి వెళ్ళలేదని, మా ఫ్రెండు ఒకతను వ్రాశాడు" అన్నాడతను. అయితే తననిగురించి శ్రద్ధపట్టి కనుక్కుంటున్నా డతను. వరలక్ష్మి కార్డుల కోసం వెతకడం మానేసి, "అల్లాగా ?'' అన్నది.

అతను గడియారం చూసుకున్నాడు. "రెండు కావస్తోంది, కాఫీ తాగుదాం రండి అల్లా వెళ్ళి" అన్నాడు. వరలక్ష్మి తల అడ్డంగా తిప్పింది. "నే నీ వేళప్పుడు కాఫీ త్రాగనండీ, థాంక్సు" అన్నది.

అతను యీ మాట అంతగా పట్టించుకోనట్లు "పోనీ టీ త్రాగుదురుగానీ, లేకపోతే–ఏదో ఒక టిఫిను తీసు కుందురుగాని, రండి" అన్నాడు. ఆమె మాట్లాడక పోవడం చూసి "ప్లీజ్, చాలా రోజులకి కలుసుకున్నాము కదా, కొంచెం మాట్లాడుకుందాం. ఇంతకీ మీరు పరీక్షకి ఎందుకు రాలేదూ యీ ఏడాది?" అన్నాడు. లైబ్రరీలో యింతసేపు సంభాషణ జరపడం అసలు యిష్టంగా లేదు ఆమెకి. అతను చాలా బలవంత పెట్టేలాగా వున్నాడు.

పుస్తకాలు, బ్యాగ్ తీసుకుని బయటికి వచ్చిం దామె, అతనితో కలిసి. మెట్లు దిగుతోంటే మళ్ళీ అడిగాడు తను పరీక్షకి రాకపోవడం గురించి.

"ఊరికేనే. పైగా ధైర్యం చాలలేదు పరీక్ష రాయగల నని." అన్నది. అతను ఆమె చేసే పనిని గురించి, కాలేజీ గురించి, పరిస్థితులను గురించి ఏవో అడిగితే, చెప్పిం దామె.

కాంటీన్‌లో ఎవరూ జనం లేరు. టీ కూడా తయారుగా లేదన్నాడు అక్కడివాడు. బిస్కెట్లు ప్లేటులో పెట్టి పట్టుకొచ్చాడు కృష్ణమూర్తి. ఒకటి తీసుకుని వరలక్ష్మి నోట్లో పెట్టుకుంది. పాతవాసన వేస్తున్నాయి.

"ఎందుకు అధైర్య పడడం మీరు–మాకు కావలసినవన్నీ చేయగలను నేను. అక్కడ ఒక పదిహేను రోజులపాటు ముందుగా వచ్చి వుంటే, కావలసినంత ధైర్యం సమకూర్చగలం మా డిపార్టుమెంటువాళ్ళం" అన్నాడతను నవ్వుతూ.

ఆమె తల వంచుకుంది. "పాలిటిక్సు యం. ఏ. కోసం శ్రమపడాలా వద్దా అని ఆలోచిస్తున్నాను. పి. హెచ్. డి. కి అప్లై చేద్దామనుకుంటున్నాను యీ ఆగస్టులో. సోషియాలజీ డిపార్టుమెంటులో ఎవ్వరూ రిసెర్చివాళ్ళు లేరు. అందువల్ల నన్ను తీసుకోవచ్చు" అన్నది. అతనికి యీ వివరాలు చెప్పా లని కూడా అనిపించడం లేదు.

బెజవాడ వెడుతూ యిల్లా వచ్చా నని చెప్పా డతను. ఆమె వూళ్ళోనే వున్నదని వ్రాయడం వల్లకూడా రావా లనిపించింది అన్నాడు.

ఆమెకి అతని మాటల్లోని అర్థం స్పష్టంగానే వుంది. కానీ ముఖాన ఏమీ సమాధానం చెప్పడం చేతగాక వింటూ ఉండిపోయింది. అర్థం తనకి స్ఫురించనట్లే మాట్లాడింది, మాట్లాడిన రెండు ముక్కలూ.

ఇంక లైబ్రరీకి వెళ్ళి చదువుకోవడం సాగేలా తోచలేదు. అతను తనకి వేరే పనేమీ లేదన్నాడు. "వెడదామంటే వెడదాం ఉందామంటే ఉందాం.'' అన్నాడు. వరలక్ష్మి బస్సు ఎక్కింది అతనితోపాటు. హాస్టలు దగ్గర దిగింది. అతనూ దిగాడు. గేటువరకూ వెళ్ళాక, "నమస్కారం" అన్న దామె అతను కూడా నమస్కారం చేశాడు. ''ఈ వేళప్పుడు విజిటర్సుని రానివ్వరు కదా?" అన్నాడు. ఆమె రానివ్వ రని చెప్పింది.

మర్నాడు సాయంత్రం – సన్న జల్లు పడింది. పసుపుపచ్చని ఎండ వచ్చింది వాన చినుకుల మధ్య. ఆ పచ్చని వెలుగులో చెట్ల నీడలు గోడమీద పడుతోంటే చూస్తూ కూర్చున్నది వరలక్ష్మి. ఆయా చీటీ పట్టుకు వచ్చింది, విజిటరు ఎవరో వచ్చినట్లు. కృష్ణమూర్తి! వెళ్ళాలా వద్దా అని ఆలోచించింది. అతని ఉద్దేశ్యం స్పష్టంగా తెలుస్తోంది. తనకి అటువంటి ఆలోచనే వుంటే, ఆరేళ్ళ క్రితం అన్నయ్య చెప్పినప్పుడే వినేది కదా? అతనితో మాట్లాడి పంపించేయాలి. నిట్టూర్చి బయటికి వచ్చి, రూము తలుపు జేరవేసింది.

అతను కూర్చుని వున్నాడు. ఇంకెవ్వరూ విజిటర్సు లేరు సెలవులు కావడం వలన. పొగడచెట్టు క్రింద బెంచీ మీద రిజిష్టరు అల్లా వదిలేసి అసిస్టెంటు వార్డెను ఎక్కడికో వెళ్ళింది. తడిసిన రిజిష్టరు తుడిచి, మూసేసి పట్టుకెడుతోంది ఆయా.

అతను లేచి నిలబడి, "డిస్టర్బు చేశానా?" అన్నాడు. మామూలుగా చేసే నమస్కారం కూడా లేదు పలుకరింపులో, అని గమనించింది ఆమె.

"లేదు; కూర్చోండి.'' అన్నది. అతను కూర్చున్నాడు. కొంచెంసేపు యిద్దరూ మాట్లాడలేదు.

"నేను బెజవాడ వెడుతూ, దారి కాకపోయినా యిక్కడికి ఎందుకు వచ్చానని

అనుమానం కలగలేదూ మీకు" అన్నాడు చిరునవ్వుతో.

వరలక్ష్మి అతని ముఖంవంక చూసింది. "ఎందుకు వచ్చారో నా కేం తెలుస్తుందీ ? నేను ఆలోచించలేదు దాన్ని గురించి." అన్న దామె.

అతను రెప్ప వాల్చలేదు. చిరునవ్వుతోనే అన్నాడు మళ్ళీ. "మీకోసం వచ్చా నంటే అర్థ మౌతుందికదూ మీకూ ?" అని

ఆమె చూపు అతని ముఖంమీదనే నిలిపింది. "అర్థమౌతుంది. కానీ - ఇదివరకు మీకు వ్రాశాను. అనవసరమైన చనువు తీసుకోవడం నా కిష్టంలేదని. మీకు ఆ వుత్తరం అందిం దనుకుంటాను" అన్నది.

"అందింది. ఉత్తరాలలో ఏమి వ్రాయడానికీ తోచలేదు - నేను చిలిపితనానికి వ్రాయలేదు మీకు ఉత్తరాలు. నే నిక్కడికి రావడంకూడా చిన్నతనంగా ప్రవర్తించా లని కాదు," అతనికంఠం ఆవేశంతో కొంచెం బొంగురుగా వినిపించింది ఆమెకి. "నాకు పెళ్ళి కాలేదు. చేసుకోవా లని ఉద్దేశ్యం యిన్నాళ్ళూ కలగలేదు - మిమ్మల్ని చూసే వరకూ కలగలేదు. మిమ్మల్ని గురించిన వివరా లన్నీ నాకు తెలుసు."

వరలక్ష్మి కొంచెం యిబ్బందిగా కదిలింది. ఆమెకి యీ సంభాషణ పొడిగించా లనిపించడంలేదు.

"మీరు చాలా పొరబడుతున్నారు కృష్ణమూర్తిగారూ. నాకు పెళ్ళిచేసుకోవా లన్న ఉద్దేశ్యం లేదు - మీరు నిష్కారణంగా యింతదూరం వచ్చారు. ఇంకా ఎన్నో చేయాల్సినవి వున్నాయి నాకు జీవితంలో. పెళ్ళిచేసుకోవాలన్న ఆలోచన నాకు ఎప్పుడూ లేదు." స్పష్టంగా, విడివిడిగా వున్న యీ వాక్యాలు అతను విన్నాడు. పదినిముషాల సేపు మాట్లాడలేదు అతను. ఆమెకూడా



"నౌకరు కాదు, నా భర్త! లేబరు యూనియన్ సెక్రటరీ."

ఏమీ అనలేదు. లేచి వెళ్ళిపోదా మనిపించినా, అతనికి మనస్సులో కలవరంగా వుందేమో నని కూర్చుండి పోయింది.

అతను తలెత్తి ఆమెకళ్ళల్లోకి చూశాడు. "మీరు చేయదలచుకున్న వన్నీ చేయడానికి నేను అభ్యంతర పెడతా ననుకోకండి... నేను చాలా ఆలోచించి, ఏదారీతోచకవచ్చాను యిల్లా..మీరు చాలా తొందరపడి సమాధానం చెప్పేశారు. నన్ను గురించి, నా సుఖం గురించేగాక, మిమ్మల్ని గురించికూడా నేను ఆలోచించాను. అల్లా సమాధానం యివ్వొద్దు. నా మాట వినిపించుకోండి." అంత పట్టుదలగా అత ననే మాటలు చీకాకు కలిగిస్తున్నాయి ఆమెకి.

ఆమె లేచి నిలబడింది. "మీకు నా అభిప్రాయం చెప్పాను. అంతకంటే ఆలోచించే దేమీలేదు. నన్ను క్షమించి, యింక వెళ్ళిపొండి కృష్ణమూర్తిగారూ. నేను చిన్న పిల్లనికాదు - ఎదో ఒకటి అనేయడానికి. అనవసరంగా మీరు ఒకటి అనడం నే నొకటి సమాధానం చెప్పడం - అదంతా ఎందుకు చెప్పండి. మీరు వెళ్ళిపొండి, నమస్కారం."

అతను లేవలేదు. కూర్చునే వున్నాడు. అతను ఏమైనా సమాధానం చెబుతాడేమోనని, మళ్ళీ ఒకసారి "నమస్కారం. క్షమించండి." అనిచెప్పి, వెనక్కితిరిగి గబగబ నడిచింది వరలక్ష్మి.

ఆ రాత్రి కొంచెం సేపు అతన్ని గురించి ఆలోచన వచ్చింది. తను చేయాలనుకున్న దేమిటి, తనకి తారసపడే మనుష్యులు, వాళ్ళ ఆలోచనలు ఏమిటి? చిన్ననాడే తన జీవితం అందరి స్త్రీలలాగా కాక, వేరొక దారినపడే స్థితి భగవంతుడు కల్పించాడు. సంసారంలో పడి, ఆ ఒడుదుడుకులన్నీ అనుభవించా లని తనకి మనస్సులో లేదు. పి. హెచ్. డి. చేయాలి. ఎల్లాగైనా డాక్టరేటు తీసుకోవాలి. ఎంత యిష్టంగా వుంటాయి ఆ పుస్తకాలు. తన మేధశక్తి నంతా కేంద్రీకృతం చేసి, చదువుకోసం వినియోగించాలి. ఎంతమంది పిల్లలు కాలేజీలో - పువ్వుల్లాంటి పిల్లలు, వాళ్ళు తనంటే చూపించే గౌరవం, ఆపేక్ష, తను మాట్లాడితే వాళ్లుపడే సంబరం - యివన్నీ చాలు తనకి.

వరలక్ష్మి ఆ రాత్రి సుఖంగా నిద్ర

పోయింది – గమ్యస్థానం చేరే రైలుఎక్కి పడుకున్న ప్రయాణీకుడిలా.

మర్నాడు సాయంత్రం విజిటర్స్ని రానివ్వరు. మూడోనాడు సాయంత్రం కృష్ణమూర్తి వచ్చాడు. కలుసుకోలేననీ, క్షమించమనీ వ్రాసి పంపేసింది వరలక్ష్మి.

*　　　*　　　*

——అల్లా అతనితో పరిచయం తెంపేసుకుంది వరలక్ష్మి. ఇంత స్పష్టంగా ఎందుకు గుర్తున్నాయి యివన్నీ – అతని కళ్ళు, చూపుకూడా గుర్తుకు వస్తున్నాయిప్పుడు. అతని ఉత్తరం మళ్ళీ విప్పి చూసింది. మామూలుగానే వ్రాశాడు. కానీ తనకి ఆ అక్షరాల్లోఏమిటోకనిపిస్తోంది సుపరిచితంగా. రాత్రంతా గాలిలో ఉండిపోయిన పూలు తెల్లారేసరికి వాసనపోయి వెలవెలబోతాయి. వాసనలేని పూలలా వున్నాయి తన ఆలోచనలు.

వరలక్ష్మి ఉత్తరం మడిచి కవర్లో పెట్టేసింది. ఈ రాత్రి గడిచిపోతుంది. తెల్లవారుతుంది. కాగికాలు, పిల్లలు, సమస్యలు, లెక్చెర్లు, ప్రిన్సిపాలుగా తన విధినిర్వహణ ఎల్లా చేయాలో, తనకి బాగా తెలుసు. ఒక వరవడిలో జరిగిపోతాయి పనులు. జీతాలు, పరీక్షలు, లెక్చెర్లు, పుస్తకాలు - మళ్ళీ పుస్తకాలు, లెక్చెర్లు-అవే. ఎంతైనా అవే. ఎన్ని సంవత్సరాలు గడిచినా అవే.

లోకంలో ఎన్నో విషయాలు జరుగుతున్నాయి - అవి తను తెలుసుకుంటోంది. వాటిని గురించి ఆలోచిస్తోంది. కానీ-అవన్నీ యిదివరకులా తనకి ఆవేశాలు రేకెత్తించడం లేదు. తనకి సంబంధించకుండా జరిగే వన్నీ తన మనస్సుకి పట్టడంలేదు. పుస్తకాలలో, పత్రికల్లో, పరీక్షల్లో ఆనందం వుంది. కానీ



తనవి కావు అవన్నీ. తన బ్రతుకుకి ఏమీ కావు అవన్నీ. పెద్దపెద్ద బీరువాల్లో నిశ్శబ్దంగా వుండే ఆ విషయాలు తనకి ఏమీకావు.

ఏమిటి బ్రతుకులో లక్ష్యం ? – ఈ ప్రశ్న ముప్పైఏళ్ల క్రితం వేస్తే సమాధానం తెలుసు వరలక్ష్మికి. పాతికేళ్ల క్రితం అన్నయ్యవచ్చి, పెళ్లి చేసుకోమని బ్రతిమాలినప్పుడు స్పష్టంగా చెప్పింది సమాధానం. ఆ తరువాత కృష్ణమూర్తికి ఖచ్చితంగా చెప్పింది.

ఇప్పుడు – చీకటి క్రమ్ముకుంటున్న యీ సాయంత్రంవేళ వరలక్ష్మి బిత్తరపోతోంది యీ ప్రశ్నకి. అదృశ్యంగా ఎవరో తనని నిలబెట్టి 'ఏమిటి నీ లక్ష్యం? ఎవరి కోసం నీ బ్రతుకు' అని అడుగుతోంటే, జవాబు తోచక తడబడుతోంది ఆమె.

వరలక్ష్మి లేచి నిలబడింది. ఇదివరకు ఎవరో తలుపుదగ్గరొచ్చి నిలబడ్డారు. ఆప్యాయంగా పిలిచి, ఆ గుమ్మానికి తోరణం కట్టాలని వచ్చారు. కానీ - తలుపువేసి వుంది. కృష్ణమూర్తి వ్రాసినట్లు, తలుపు వేసివుంది.

అప్పుడు తలుపు తెరవలేదు తను. గాలి కూడా చొరకుండా, పిలుపు వినరాకుండా మూసివేసింది. వాళ్లు తిరిగి వెళ్ళిపోయారు. ఇప్పుడు - చలిగాలి వీస్తూ, చీకట్లు మూసుకుంటున్న సందెవేళ బార్లా తలుపు తెరచింది తను. 'వరలక్ష్మి' అని ఎవరో రహస్యంగా తలుపుదగ్గర పిలుస్తున్నా రనిపించింది. కానీ లేదు - ఎవ్వరూ పిలవరు.

చీకటితప్ప ఏమీ కనబడడం లేదు తెరచుకున్న తలుపులోంచి. లోపల తను ఎన్ని దీపాల తోరణాలు వెలిగించి, స్వాగత మిస్తేనేమి, ఎవరూ రారు, ఎవ్వరూ రారు !